నేడు తూంకుంట మున్సిపల్ కమిషనర్‌తో...

'సాక్షి' ఫోన్ ఇన్



ఆర్.వెంకటగోపాల్

శామీర్‌పేట్: ఇటీవలి కాలంలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ ఇతరత్రా వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా జ్వరాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై తూంకుంట మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటగోపాల్‌తో 'సాక్షి' దినపత్రిక ఆధ్వర్యంలో ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నాము. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, తీసుకుంటున్న చర్యలపై ప్రజల ప్రశ్నలకు కమిషనర్ ఫోన్‌లో సమాధానాలు ఇస్తారు.

సమస్యల పరిష్కారం కోసం ఫోన్: 96669 22234 లో సంప్రదించవచ్చు.

అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టరేట్, పురపాలికలు, ఎంపీడీఓ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు
- నేడు పాఠశాలలకు సెలవు
- ప్రజావాణి రద్దు: కలెక్టర్ గౌతమ్ సూచన



సాక్షి, సిటీబ్యూరో: భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటికి రాకూడదని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం తెలిపారు శనివారం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ట్రాన్స్‌పార్మర్లు, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.

- కలెక్టరేట్‌లో ఫోన్: 94924 09781తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ ప్రకటించారు. జిల్లాలోని అన్ని పురపాలక సంఘాలు, ఎంపీడీవో కార్యాలయాలలో కూడా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలకు ఏవైనా సందేహాలు, సమస్యలు ఉన్నట్లయితే కంట్రోల్ రూమ్ నంబర్లకు సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.
- మరో 24 గంటల పాటు భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని అన్ని పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు.
- భారీ వర్షాల కారణంగా జిల్లా యంత్రాంగం అప్రమత్తమై రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహిస్తున్నందున కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గౌతం వెల్లడించారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వ్యక్తిగత నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



విద్యార్థికి పట్టా అందజేస్తున్న సుబ్బరంగయ్య, గోపాల్ కృష్ణమూర్తి

ఘట్‌కేసర్: గ్లోబల్ మార్కెట్‌లో రాణించాలంటే వ్యక్తిగత నైపుణ్యం అభివద్ధి చేసుకోవాలని వేదా ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ సుబ్బరంగయ్య అన్నారు. ఆదివారం అంకుషాపూర్ ఏసీఈ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టభద్రులకు పట్టాలను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు గమ్యం చేరుకోవాలంటే అధ్యాపకులు సూచించిన మార్గంలో ముందుకెళితే విజయం సాధ్యమన్నారు. విద్యార్థులు తమపై నమ్మకం పెంచుకోవాలని, అప్పుడే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ప్రతి విద్యార్థి గొప్ప విజయాలు సాధించి దేశాభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. కార్యక్రమంలో గౌరవ అతిథి ఏసీఈ కళాశాల ప్రధాన కార్యదర్శి గోపాల కృష్ణమూర్తి, సీఓఓ రఘువంశీ, ప్రిన్సిపాల్ రాజు, విద్యార్థులు, తల్లితండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'అత్యవసరమైతేనే బయటకు రండి'



రోడ్డుపై పడిన చెట్లను తొలగింపజేస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రావొద్దని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మున్సిపాలిటీ పరిధిలో నేల కూలిన చెట్లను తొలగించి నిండిన డ్రైనేజీ, రోడ్డుపై కూరుకు పోయిన మట్టిని జేసీబీ సాయంతో ఆదివారం శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ... లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటిని వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. చిన్న పిల్లలను డ్రైనేజీ సమీపంలోకి, రోడ్డుపైకి రాకుండా జాగ్రత్త పడాలని, అత్యవసరమైతే మున్సిపల్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. సబ్‌స్టేషన్ ఏఈ సతీశ్ కుమార్ మాట్లాడుతూ... విద్యుత్ స్తంభాలకు, ఇతర కేబుల్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో దేవేందర్ ముదిరాజ్, శ్రీధర్, రాజేశ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మాస శివరాత్రి పూజలు



పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

కీసర: కీసరగుట్టలోని శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం మాస శివరాత్రి సందర్భంగా స్వామి వారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నాగలింగం, కార్యనిర్వహణాధికారి సుధాకర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కీసరలో కూలిన పురాతన ఇల్లు



నాగారంలో విరిగి పడిన విద్యుత్ స్తంభం



లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులు



గౌడవెల్లి శివార్లలో ప్రవహిస్తున్న నీరు

వర్షం..

స్తంభించిన జీవనం



అలుగు పోస్తున్న మేడ్చల్ పెద్ద చెరువు

- శివారు లోతట్టు ప్రాంతాలు వరదమయం
- పట్టణాలు, గ్రామాల్లో రోడ్ల పరిస్థితి అధ్వానం
- వర్షాలతో ఛిద్రమైన కల్వర్టులు, నాలాలు
- పలు చెరువులు, నాలాల కబ్జాతో కాలనీల్లోకి చేరుతున్న వరద నీరు

సాక్షి, సిటీబ్యూరో: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షం.. జల్లులతో నగర శివారు పట్టణాలు, గ్రామాల్లో జనజీవనం స్తంభించిపోయింది. రోడ్లు అధ్వానంగా గుంతలమయం కాగా, లోతట్టు ప్రాంతాలు, కాలనీల్లోకి వరద నీరు చెరుతోంది. పలు చోట్ల కల్వర్టులు, డ్రైనేజీ కాలువలు ఛిద్రమయ్యాయి. దీంతో బస్తీ, పల్లెవాసులకు ఇబ్బందులు తప్పటం లేదు.

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని పలు రోడ్లతోసహా పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లోని రోడ్లు కూడా వర్షాలతో దెబ్బతిన్నాయి. మట్టి రోడ్ల పరిస్థితి మరింత అధ్వానంగా మారటంతో కాలినడకకు కూడా ఇబ్బందులు తప్పటం లేదు. నాగారంలో విద్యుత్ స్తంభం విరగగా, పీర్జాగూడలో చెట్లు విరిగిపొయయి. ఇదే పరిస్థితి పలు చోట్ల చోటుచేసుకుంది.
- జిల్లాలోని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సాయినగర్, మల్లన్న నగర్, చెంగిచర్ల తదితర కాలనీలలో రోడ్లన్నీ వరదమయంగా మారాయి. పీర్జాదిగూడ నగరపాలక సంస్థలో పలు రోడ్లు, కాలనీలు కూడా వరద నీటితో నిండిపోయాయి. పీర్జాదిగూడ పెద్ద చెరువు పరిసర ప్రాంతాల్లోని కాలనీలన్నీ జలమయంగా మారాయి. పెద్ద చెరువు కబ్జాకు గురైనందునే ఏటా వర్షాకాలంలో ముఖ్యంగా వర్షాలు పడినప్పుడల్లా వరద నీరు ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.
- నాగారం మున్సిపాలిటీలో ప్రధాన రోడ్డు జలమయం కావటంతో వాహనదారులు పడరాని పాట్లు పడ్డారు. దమ్మాయిగూడ, కాప్రా చెరువులు కబ్జాకు గురికావటంతో సమీప కాలనీల్లో వరద నీరు చేరి జలమయంగా మారాయి. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీలో పలు కాలనీల్లో రోడ్లన్నీ ఛిద్రంగా మారటంతో పట్టణ ప్రజలు పలు కష్టాలను ఎదుర్కొంటున్నారు. జవహర్‌నగర్, పోచారం, దుండిగల్, ఘట్‌కేసర్, తూంకుంట, నిజాంపేట్ పురపాలక సంఘాల్లోని పలు కాలనీల్లో రోడ్లు, మురికి కాలువలు, నాలాలు వర్షంతో దెబ్బతిన్నాయి.
- కీసర, శామీర్‌పేట్ మేజర్ గ్రామ పంచాయతీలతోపాటు పలు గ్రామాల్లో వర్షంతో రోడ్లు అధ్వానంగా మారగా, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం సహాయక చర్యలకు ఆదేశించగా, పురపాలక, పంచాయతీ పాలకవర్గం, సిబ్బంది రంగంలోకి దిగి పలు సహాయక, మరమ్మతు కార్యక్రమాలను చేపడుతున్నారు.
- ఉప్పల్ నుంచి వరంగల్ జాతీయ రహదారిలోని అన్నోజిగూడ బ్రిడ్జి వరకు జాప్యంగా సాగుతున్న రోడ్డు విస్తరణ పనుల వల్ల రోడ్లపై వరద నీరు నిలిచిపోవటంతో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభన నెలకొంటోంది. దీంతో వాహన చోదకులు, వ్యాపార వర్గాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెంగిచర్ల బస్సు డిపో వద్ద ఉన్న చెరువు కట్టను ధ్వంసం చేసి బహుళ అంతస్తుల భవనాన్ని నిర్మించటం వల్ల సమీపంలోని ఉన్న కాలనీల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో స్థానికులకు ఇబ్బంది పడుతున్నారు.



పూడూర్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు



కిష్టాపూర్ రోడ్డులో ప్రవహిస్తున్న మేడ్చల్ వాగు



పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో..



రైల్వే అండర్‌పాస్ వద్ద కుంగిన రోడ్డు

సీపీఎస్, యూపీఎస్ వద్దు.. పాత పెన్షన్ ముద్దు..!

కలెక్టరేట్ వద్ద పెన్షన్ విద్రోహ దినంలో ఉద్యోగుల జేఏసీ సంఘాలు



సాక్షి, సిటీబ్యూరో: పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆదివారం వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయుల, పెన్షనర్ల సంఘాల జేఏసీ, టీఎన్‌జీవోస్‌ల ఆందోళనా, బైఠాయింపు కార్యక్రమాన్ని చేపట్టారు. తెలంగాణ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు జిల్లా ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ బి.రవిప్రకాష్ అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. కుండపోతగా కురుస్తున్న వర్షాన్ని కూడా లెక్కచేయకుండా ఆందోళనా కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వివిధ సంఘాల కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇటీవల యూనిఫైడ్ పెన్షన్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకురావటాన్ని ఉద్యోగుల జేఏసీ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్,యూపీఎస్ వద్దు–ఓపీఎస్ మాత్రమే కావాలని ఉద్యోగులు జేఏసీ కార్యకర్తలు నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ బి.రవిప్రకాష్, వివిధ ఉద్యోగ సంఘాలు, జేఏసీ నాయకులు వినోద్ కుమార్, కురుమూర్తి, బి.భరత్‌కుమార్, గిరికాంత్, శామ్యూల్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు వెంకటేశ్వర్లు, జయసింహారెడ్డి, ఆనంద్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సుధాకర్‌రెడి, రామేశ్వర్‌గౌడ్, సుధాకర్‌గౌడ్, శశికాంత్, శ్రీనివాస్ తిరుమల, ప్రసాద్ పాల్గొన్నారు.

బీసీలకు జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం కల్పించాలి



ఘట్‌కేసర్: బీసీలకు జనాభా నిష్పత్తి ప్రకారం చట్టసభల్లో ప్రతినిధ్యం కల్పించి మండల కమిషన్‌లోని 40 సిఫార్సులను అమలు చేయాలని, అప్పుడే అంబేద్కర్‌కు నిజమైన నివాళి లభిస్తుందని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు గంగి జగన్ అన్నారు. ఆదివారం అంబేద్కర్ ఆలోచన విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ప్రభుద్ధ భారత్ ఇంటర్నేషనల్ బాధ్యుడు మీసాల అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ... అంబేద్కర్ రాజ్యాంగంతో నేడు బహుజనులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అగ్రవర్ణాలతో పోటీ పడే విధంగా ఎదుగుతున్నారని అన్నారు. అంబేద్కర్ మార్గంలో నేటి యువత పయనించి అభివృద్ధి చెందాలన్నారు. నేతలు ప్రసాద్, దాసు, మల్లేశ్, రాధాకృష్ణ ముదిరాజ్, శ్రీనివాస్, కళ్యాణ్, జగదీశ్, ఉపేందర్, భరత్‌కుమార్, సచిన్, ప్రవీణ్, హర్షవర్ధన్‌చారి పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

బోడుప్పల్: పెంటారెడ్డి కాలనీలోని శ్రీమాతా నిమిషాంబదేవి ఆలయంలో శ్రావణ మాసం చివరి ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి సౌభాగ్యలక్ష్మి, సుమంగళి లక్ష్మి, కుంకుమార్చన, లక్ష గాజులతో విశేష అలంకరణ మహోత్సవాలు చేశారు. ఆలయ చైర్మన్ వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శులు అశోక్‌కుమార్, శ్రీనివాస్, కోశాధికారి రమేష్, రాష్ట్ర నకాష్ సంఘం ప్రధాన కార్యదర్శి కొరిచర్ల శ్రీనివాస్‌రావు, ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్‌శర్మ, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న సన్ రైజ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

ఘట్‌కేసర్: నోటి కేన్సర్‌తో బాధపడుతున్న నాగర్ కర్నూల్‌కు చెందిన గిద్ద నర్సయ్యకు ఎన్ఎఫ్‌సీనగర్‌లోని సన్ రైజ్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఆ ట్రస్ట్ సభ్యులు ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. పేదరికం కారణంగా చికిత్స పొందేందుకు సాయం అందించాలన్న విన్నపం మేరకు ట్రస్ట్ సభ్యులు ఆయనకు రూ. 10 వేలు సాయం చేశారు. ట్రస్ట్ సభ్యులు సుందరరావు, సోమయ్య, ఐలయ్య, శరబంద, వీరారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీకాంత్, ఎం.శ్రీకాంత్ పాల్గొన్నారు.

బాల్య మిత్రురాలి కుటుంబానికి...

బాల్య మిత్రురాలి కుటుంబానికి ఆమె స్నేహితుల బందం ఎదులాబాద్‌లో ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. ఎదులాబాద్ జెడ్పీ పాఠశాలలో 1995–96వ విద్యా సంవత్సంలో పదో తరగతికి బ్యాచ్‌కు చెందిన విద్యార్థిని సునోజు స్వప్న భర్త ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అప్పటి పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆమెకు రూ. 72,600 అందజేశారు.



ఎదులాబాద్‌లో సాయం అందజేస్తున్న స్నేహితులు

అనుమతుల్లేని పల్లవి స్కూల్‌ను మూసివేయాలి

కౌన్సిలర్ బాలగోని వెంకటేశ్ గౌడ్



పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో అనుమతులు తీసుకోకుండా నిర్వహిస్తున్న పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌ను మూసివేయాలని కౌన్సిలర్ బాలగోని వెంకటేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... భవన నిర్మాణ పనులు జరుగుతుండగానే స్కూల్‌ను ఏర్పాటు చేసి విద్యా సంవత్సరాన్ని కొనసాగిస్తున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులను చేర్చుకున్నారని చెప్పారు. ఒకవైపు పాఠశాల, మరో వైపు నిర్మాణ పనులు కొనసాగడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పల్లవి స్కూల్ నిర్మాణం చేపట్టిన స్థలం వివాదంలో ఉందని, కోర్టులో కేసు విచారణలో ఉందన్నారు. వివాదాస్పద స్థలంలో ఎలాంటి నిర్మాణ చర్యలు చేపట్టకుండా యథాతథ స్థితి ఉండాలని హైకోర్టు జారీ చేసిన ఆదేశాలను స్కూల్ యాజమాన్యం ఖాతరు చేయడంలేదన్నారు. పల్లవి స్కూల్ యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు తాను లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

మత్తు పదార్థాలతో అనర్థాలపై అవగాహన



మేడిపల్లి: నిషేధిత మత్తు పదార్థాలు సేవించి యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా తమ విలువైన జీవితాన్ని, కుటుంబాలను నాశనం చేసుకోవద్దని మేడిపల్లి పోలీస్‌స్టేషన్ సీఐ గోవిందరెడ్డి అన్నారు. ఆదివారం మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో మత్తుపదార్థాలు సేవించి పట్టుబడి జైలు జీవితం గడిపిన సుమారు 30 మందికి వాటివల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ.. గణపతి, దేవీ నవ రాత్రుల సందర్భంగా యువకులు మండపాలవద్ద నిషేధిత మత్తు పదార్థాలు సేవించినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవని, అలాంటి వారి వివరాలను పోలీసులకు తెలియజేయాలన్నారు.

వాగుల వద్ద పోలీసుల పహారా

శామీర్‌పేట్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని వాగులు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. ఈ నేపథ్యంలో శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధి ఉన్న వాగులు, చెరువుల వద్ద పోలీసులు కాపలా కాస్తున్నారు. భారీ వర్షాలు కురుస్తున్నందున విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని, ఇంట్లోని విద్యుత్ పరికరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో 100కు కాల్ చేయాలని తెలిపారు.



శామీర్‌పేట పెద్దచెరువు వద్ద పహారా కాస్తున్న పోలీసులు



అలియాబాద్–బాబాగూడ రోడ్డులో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు, బందోబస్తు విధుల్లో పోలీసులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220387